epaper.manachourasta.com

# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



**బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది**

- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

4

సంపుటి : 01 | సంచిక : 57 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 25 జనవరి 2026 | పేజీలు : 04




## బాలికల హక్కులను పరిరక్షించాలి

- **ఉజ్వలతో బాలికల అభ్యున్నతికి కృషి**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** ఆడపిల్ల ఉన్న ప్రతీ ఇల్లు ఎప్పుడు సంతోషకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షతను ప్రదర్శించకుండా వారి అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై క్రమం తప్పకుండా వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ.. ఉజ్వల అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆడపిల్ల లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే ఉజ్వల ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉజ్వల కమిటీలను ఏర్పాటు చేసి బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. అలాగే "బేటీ బచావో - డిజిటల్ హటావో" అనే సందేశంతో బాలికలను డిజిటల్ దుర్వినియోగం నుండి రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి బాలికకు విద్య అందించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు, ఆడపిల్లలకు గొప్ప హోదా ఉండాలన్నారు. మన జిల్లాలో అమ్మాయిలకు చదువు మీద ఎక్కువ ఆసక్తి ఉందని, ఇలాగే తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఒక్క చదువులోనే కాక క్రీడల్లో, NCC, సాంస్కృతిక కార్యక్రమాలలో ఆడపిల్లలు భాగస్వామ్యం అయ్యేల తల్లిదండ్రులు, ఉపాధ్యయులు కృషి చేయాలన్నారు. వారికి సరైన నైపుణ్యలను అందిస్తే ఆకాశమే హద్దుగా వారి భవిష్యత్ సాగుతుందన్నారు. డీసీపీ రాజ మేంద్ర నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, పిల్లలు ఎదుర్కొనే సమస్యలను ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీవో కోదండరాములు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, జడ్పీ అదనపు సీఈఓ, జీసీడీఓ గౌసియా బేగం, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, సభ్యులు శ్రీలత, కవిత, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, చైల్డ్ లైన్ సిబ్బంది, బాలికలు, ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.





## జనగామ కాంగ్రెస్ లీడర్లకు పీసీసీ క్లాస్?!

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

- హుందాగా వ్యహరించాలని హితవు!
- సీతక్క పర్యటనపై ఆరా తీసిన పీసీసీ ప్రెసిడెంట్!
- ప్రభుత్వ, పార్టీ పరువు తీయొద్దు
- స్థానిక నేతలపై మహేశ్‌కుమార్ గౌడ్ సీరియస్?

జనగామ కాంగ్రెస్ నేతలపై పార్టీ హైకమాండ్ సీరియస్ అయినట్టు సమాచారం. శుక్ర వారం జనగామలో జరిగిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటనపై రాష్ట్ర ప్రభుత్వం, పీసీసీకి అందరి ఇంట లీజన్సీ రిపోర్టుతో పార్టీ పెద్దలు స్థానిక నాయకత్వంపై గరం అయినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో సొంత పార్టీ వారే రచ్చ చేయడంపై అధిష్ఠానం సీరియస్ అయినట్టు సమాచారం. ఎంతో హుందా ఉండి మంత్రి పర్యటనను సక్సెస్ చేయాల్సిన నేతలు ప్రతిపక్ష పార్టీతో బాహాబాహీకి దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

**పీసీసీ ఆరా..!**

జనగామలో జరిగిన మంత్రి సీతక్క పర్యటనపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరా తీసినట్టు తెలుస్తోంది. మంత్రి సీతక్క పాలకుర్తి నుంచి జనగామ వరకు సాగిన పర్యటన వివరాలను పూర్తిగా ఆయన తెలుసుకున్నట్టు సమాచారం. పాలకుర్తిలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగించుకుని జనగామకు వచ్చిన మంత్రికి ఇక్కడ జరిగిన అవమానాలపై ఆయన గరం అయినట్టు తెలిసింది. ఇందుకు కారకులైన వారిపై పీసీసీ ప్రెసిడెంట్ సీరియస్ అయినట్టు సమాచారం. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో హుందాగా వ్యవహరించాలని హితవు పలికినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇదే సమయంలో పార్టీకి భగం వాటిల్లే కార్యక్రమాలకు పూనుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్టు సమాచారం.

**మున్సి'పోల్స్'లో కలిసి పనిచేయాలి**

ఇక రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అందరి కలిసికట్టుకు పనిచేసి పార్టీ అభ్యర్థులకు గెలిపించాలని పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ సూచించనట్టు సమాచారం. పార్టీలో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ నేతలు, కొత్తగా వచ్చిన వారిని అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్టు తెలుస్తోంది.

# ఆడబిడ్డను పుట్టనిద్దాం.. రక్షిద్దాం..




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ప్రపంచ బాలిక దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డలపై అవగాహన కార్యక్రమం ప్రపంచ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని “ఆడబిడ్డను పుట్టనిద్దాం... రక్షిద్దాం... చదివిద్దాం” అనే నినాదంతో గర్భిణి స్త్రీలు మరియు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విస్తృత స్థాయిలో అవగాహన ర్యాలీ చేపట్టి, బాలికల హక్కులు, ప్రాధాన్యత, సమాజంలో వారి పాత్రపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మౌనిక, భారతి, రాజు, వనజ, స్వరూపలు మాట్లాడుతూ గర్భధారణ సమయంలో లింగ నిర్ధారణ చేయడం చట్టవిరుద్ధమని, ఆడపిల్లల పుట్టుకను అడ్డుకోవడం మానవత్వానికి విరుద్ధమని ప్రజలకు తెలియజేశారు. ఆడబిడ్డ పుట్టుక కుటుంబానికి భారముకాదని, భవిష్యత్తులో సమాజ అభివృద్ధికి ఆమె శక్తివంతమైన ఆధారమని వారు స్పష్టం చేశారు. ర్యాలీలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు పుథిలి, పుష్పలత, అలేఖ్యలు గర్భిణి స్త్రీలకు అవసరమైన పోషకాహారం, క్రమబద్ధమైన వైద్య పరీక్షలు, ప్రసవానికి ముందు మరియు తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే బాలికల ఆరోగ్యం, విద్యపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలకు సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని, వారిని చదివించి, రక్షించి, ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

# శ్రీకాంత్ అన్న యువసేన ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కొత్తపల్లి మండలం సాయినగర్ గ్రామంలో శ్రీకాంత్ అన్న యువసేన ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పోటీలు జనవరి 25వ తేదీ ఆదివారం నాడు ఒకే రోజు జరుగనున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించే పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ. 10,000లు, ద్వితీయ బహుమతిగా రూ. 5,000లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జట్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.ప్రతి జట్టు తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉండగా, ఒక్కో ఆటగాడి నుంచి రూ. 150ల నమోదు రుసుము వసూలు చేస్తామని తెలిపారు. ఉదయం 10 గంటలకు మైదానంలో అన్ని జట్ల ఆటగాళ్లు హాజరై ఉండాలని, ఆ సమయంలో జట్ల ఎంపిక కోసం బహిరంగ డ్రా నిర్వహిస్తామని చెప్పారు. ఈ వాలీబాల్ పోటీలు ఒకే రోజు నిర్వహించబడతాయని, హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన ఆటగాళ్లకే పాల్గొనే అవకాశం ఉంటుందని నిర్వాహకులు స్పష్టం చేశారు. పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాల కోసం భరత్ గౌడ్, కె. శ్రీకాంత్‌లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.





# విద్యార్థినులకు నూతన దుస్తుల పంపిణీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థినులకు నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గోలి శ్రీనివాస్ విద్యార్థినుల కోసం నూతన డ్రస్సులు అందజేశారు. గ్రామ పాఠశాలలో చదువుతున్న బాలికల అవసరాలను గుర్తించి, వారి చదువుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నూతన దుస్తులు అందుకోవడంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల అభ్యుదయానికి తోడ్పడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్రుడు మల్లికార్జున రావు కూడా పాల్గొని విద్యార్థినులను ఉత్సాహపరిచారు. విద్యా రంగ అభివృద్ధికి వ్యక్తిగతంగా ముందుకు వచ్చి సహకారం అందించిన గోలి శ్రీనివాస్‌కు కొప్పూరు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలి

**కరీంనగర్, మన చౌరాస్తా :** కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని, హుస్నాబాద్ పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజల ఆలోచన, ఆశీర్వాదం, నమ్మకం బీజేపీపై ఉందని పేర్కొన్న ఆయన, ఈసారి హుస్నాబాద్ మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని సూచించారు.





# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ నిధులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులు, చొరవతో మంజూరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పీ. లిటిసరోజనకు రూ. 60,000లు, ఆవుల రజితకు రూ. 60,000లు, పిట్టల తిరుమలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయని వెల్లడించారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి సదానందం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్పాటి గురువారెడ్డి, డబ్బా శంకర్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు చాగంటి వెంకటేశ్వర్లు, ఎలుకపల్లి ప్రేమలత, మార్పాటి లలిత రెడ్డి, సాతుర్ విజయ, శాలువా సంధ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాచర్ల సదానందం, చిట్టెంపల్లి వెంకటేష్, పచ్చునూరు కరుణాకర్, బొల్లంపల్లి కుమారస్వామి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలు, బాధితులకు తక్షణ సహాయం అందుతుందని, ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.




# ములకనూర్‌లో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం

**భీమదేవరపల్లి,మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకం కింద భీమదేవరపల్లి మండలం ములకనూర్ గ్రామంలో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ములకనూర్ సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్ రెడ్డి గారి మామిడి తోటలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త డా. జి. వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రస్తుతం మామిడి పంటలో ఉన్న పూత దశలో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. సస్య రక్షణ చర్యలుగా లీటరు నీటికి ఐదు మిల్లీలీటర్ల వేప నూనె పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా పురుగుల నివారణకు లీటరు నీటికి ముప్పై శాతం మోతాదులో పురుగు మందులు, ఒకటిన్నర గ్రాముల శిలీంద్రనాశక మందులు పిచికారి చేయాలని తెలిపారు. పూత ముందుగానే రావడానికి అవసరమైన ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి అనసూయ మాట్లాడుతూ, ప్రభుత్వం మామిడి రైతులకు అందిస్తున్న పథకాలు, మామిడి పంట నాణ్యత పెంపొందించేందుకు అనుసరించాల్సిన మెరుగైన యాజమాన్య విధానాలపై వివరించారు. మామిడి కాయలకు కవర్లు వినియోగించడం వల్ల నాణ్యత పెరిగి మంచి ధర లభిస్తుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం ఎకరానికి పది వేల రూపాయల రాయితీ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హనుమకొండ విభాగ ఉద్యాన అధికారి సుస్మిత మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటలు, కూరగాయలు, నూనె గింజల పంటలు మరియు నీటి పొదుపు పద్ధతులకు సంబంధించిన రాయితీల వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మ, ఉద్యాన విస్తరణ అధికారి దేవరాజ్, వ్యవసాయ విస్తరణ అధికారి కమల్ హాసన్, ములకనూర్ సహకార సంఘం ఉప ప్రధాన నిర్వాహకుడు సతీష్, సహకార సంఘ వ్యవసాయ అధికారులు, ఔషధ తయారీ సంస్థ ప్రతినిధి పున్నం చందర్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల మామిడి రైతులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందంజ

## కడియం శ్రీహరి



**హనుమకొండ, మన చౌరాస్తా :** ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, ఆకాశమే హద్దుగా ఎదగాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం గొల్లకిష్టంపల్లి కస్తుర్భా గాంధీ పాఠశాలలో కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి కోటి 28 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఆడపిల్లలు మగ పిల్లల కంటే ఏమాత్రం తక్కువ కాదని, ఏ రంగంలో చూసిన అగ్ర భాగం ఆడపిల్లలదే ఉందని తెలిపారు. ఆడపిల్లల విద్యను ప్రోత్సహిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు అనడానికి ఉదాహరణ మన కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. అతిచిన్న వయసులో ఐఏఎస్ సాధించి మన జిల్లా కలెక్టర్ గా పని చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో గిరి రాజ్ గౌడ్ , పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సృజన, తహసీల్దార్ కొమి , ఎంపిడివో లక్ష్మీ ప్రసన్న, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ఇతర సర్పంచులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు సరైన వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆలయ ఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆయల పరిసరాల్లో కొబ్బరికాయల రేటు 50 రూపాయలు అమ్ముతున్నారు, 30 రూపాయలుకు బోర్డు ఏర్పాటు చేసి మైక్ లో అనౌన్స్ చేయాలి. మల్లన్న కోరమీసాలు అధిక ధరలతో అమ్ముతున్నారు ధరలను కట్టడి చేయాలి. కొమురవెల్లి దేవస్థానం భక్తుల విలువలను కాపాడాలి. దేవాలయం పరిధిలో అన్ని రోడ్లలో శుభ్రపరిచాలి..' అని కోరారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ తేలు ఇస్తారీ, సీపీఎం మండల నాయకులు పుల్లంపల్లి సాయిలు, బక్కిలి బాలకిషన్, సార్ల యాదయ్య, కానూగుల రాజు, శ్రవణాచారి, రవీందర్, కర్రోల లెనిన్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.






# జనగామలో ఘటనపై బీఆర్ఎస్ నిరసన

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు మరియు ముఖ్య కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిన్న జనగామ పట్టణంలో పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపన ప్రారంభోత్సవం చేయడానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క జనగామ కు రావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఫోటో కాల్ ప్రకారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కూడా వెళ్లడం జరిగింది. ప్రారంభోత్సవ సమయంలో కొమ్మూరి ప్రతాపరెడ్డి మరియు కొడుకు ప్రశాంత్ రెడ్డి తన అనుచరులతో మద్యం సేవించి స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పై దాడి చేయడం మరియు విచక్షణమైన పదాలను వాడడం జరిగిందన్నారు. గతంలోనే జనగామ ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పిన వారి తీరు మారలేదన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి సర్పంచ్ పద్మ ఆంజనేయులు, తపస్పల్లిసర్పంచ్ కనకరాజు, రసూల్బాద్ సర్పంచ్ అనూష స్వామి,గౌరయపల్లి సర్పంచ్ రాజు, లెనిన్ నగర్ సర్పంచ్ పరశురాములు సీనియర్ నాయకులు నర్సిములు గౌడ్, కొమురవెల్లి ఉపసర్పంచ్ శ్రీనివాస్, రసూలాబాద్ ఉపసర్పంచ్ స్వామి కొమరవెల్లి మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్, మాజీ యూత్ మండల అధ్యక్షుడు నరేష్, అయినా పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ వార్డు మెంబర్లు కార్యకర్తలు బహదూర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

# గాంధీ పేరు తొలగిస్తే మరో ఉద్యమం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాలకు ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరుతో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసింది కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తే మరో ఉద్యమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మర్రిముచ్చాల సర్పంచ్ జంగని రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గాంధీ పేరు తొలగించడానికి నిరసనగా శనివారం గ్రామాలలో ఉపాధి హామీ పనిచేసే వాళ్ళ దగ్గరికి వెళ్లి ఈ పథకం రద్దు చేస్తే వచ్చే నష్టాలను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా జంగని రవి మాట్లాడుతూ దేశం కోసం శాంతియుతంగా ఉద్యమం చేసి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ ని ప్రపంచదేశాలు పూజిస్తుంటే మనదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు రచించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడానికి పూనుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు మహాత్మా గాంధీ స్వరాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో కాంగ్రెస్ కార్యకర్తలు మహాత్మా గాంధీ పేరు మార్పు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనను చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బద్దిపడగ రఘుపతి రెడ్డి, వార్డ్ మెంబర్లు చింతల శ్రీరామ్, దారా రాజు, చుంచు, శ్రీనివాస్ వంగ, సంజీవరెడ్డి, వంగ రాజిరెడ్డి, వంగ కిష్టారెడ్డి, రంగు అయిలేని గౌడ్, వంగ నర్సిరెడ్డి, జంగని ప్రభాకర్, చుంచు ప్రభాకర్, ఎంటే రాజు, చుంచు నరసయ్య పాల్గొన్నారు.



# క్యాలెండర్ ఆవిష్కరణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో టూరిజం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టూరిజం రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టూరిజం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు కే. లక్ష్మీనారాయణతో పాటు టూరిజం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

# పాఠశాలను సందర్శించిన సర్పంచ్



**మద్దూరు మన చౌరాస్తా :** మండలంలోని నర్సాయపల్లి శివారు పిట్టలగూడెం లో ఉన్న యుపిఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మద్దూరు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నర్సాయపల్లి సర్పంచ్ శనిగరం సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను కోరారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే విద్యార్థులకు పెట్టించాలని ఆయన కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాటం శ్రీనివాస్, వార్డు సభ్యులు రాగుల బాల్ నర్సయ్య, గ్రామస్తులు తుమ్మల కిషన్, రవి,ఆనంద్, సుధాకర్, తదితరులు ఉన్నారు.



# స్టేషన్‌ఘన్‌పూర్ కేసీఆర్ వెన్నంటే ఉంటది

**జనగామ ఎమ్మెల్యే పల్లా**

**స్టేషనన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఘన్‌పూర్ గడ్డ 2001 నుంచి కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తోందని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి పద్మావతి కన్వెన్షన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. నీళ్లు, అభివృద్ధి తానే చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు కోసం ఒక్క తట్ట మట్టి తీయలేదని ఆరోపించారు. ఘన్‌పూర్ అభివృద్ధిని అడ్డుకున్నది కడియమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం ఫలితంగానే రాష్ట్రం సాధ్యమైందని, 2014, 2018 ఎన్నికల్లో ఘన్‌పూర్ ప్రజలు కేసీఆర్‌కు ఘన విజయం అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హామీలు అమలుకాలేదని విమర్శించారు. కడియం కుటుంబ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌కు అమ్ముడుపోయాడని ఆరోపించారు. కడియం మోసాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని, పార్టీ గుర్తుపై ఓటు వేయాలని సూచించారు.




# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మన చౌరాస్తా :** రోడ్డు భద్రత నియమాలు పాటించడం మనందరి భాద్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం 2026ను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో పోచమ్మమైదానం నుండి వరంగల్ చౌరస్తా వరకు నిర్వహించిన వాకథాన్ ర్యాలీని జిల్లా కలెక్టర్. డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్ బాబు తదితరులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రహదారి భద్రతపై అధికారులు, ప్రజలు, యువకులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీ పోచమ్మమైదానం నుండి వరంగల్ చౌరస్తా వరకు కొనసాగింది. "హెల్మెట్ ధరించండి - ప్రాణాలు కాపాడుకోండి" అనే నినాదాలతో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా జిల్లా లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విస్తృత స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల బారిన పడకుండా, ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు.

## బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది

**రాష్ట్ర క్రీడ శాఖల మంత్రి శ్రీహరి**

**తొర్రూరు, మన చౌరాస్తా :** రాబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం,తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనగా ప్రభుత్వ చీఫ్,డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమా మురళి నాయక్ లతో కలిసి వారు మాట్లాడారు. గత ప్రభుత్వ పదేళ్ల అహంకారాన్ని పది రోజుల్లో దించిన ఘనత పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రెడ్డి,ప్రజలదని,ప్రజా ప్రభుత్వానికి మరింత బలం పెరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తాను సర్పంచ్ నుంచి రాష్ట్ర మంత్రి వరకు ఎదిగామని, మీరు కూడా ఈ స్థాయి నుంచి ఏ స్థాయికైనా వెళ్ళవచ్చు అని తెలిపారు.మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ హయాంలో అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు.

## రిపబ్లిక్ డే వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటం

# తప్పనిసరి చేయాలి

**తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అమలైనప్పుడే అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని విశ్వసించిన మహనీయుడు డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ అని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు. సర్వసత్తాకత్వానికి వ్యతిరేకంగా సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని నిర్మించాలనే సదుద్దేశంతో డాక్టర్ అంబేద్కర్ 2 సంవత్సరాలు 11 నెలలు 18 రోజుల పాటు నిరంతర శ్రమ చేసి భారత రాజ్యాంగాన్ని రూపొందించారని గుర్తుచేశారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని సమర్పించగా, భారత ప్రభుత్వం 1950 జనవరి 26న దాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. అప్పటి నుంచే ఆ రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అయితే రిపబ్లిక్ డే వేడుకల్లో డాక్టర్ అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకోవడం కాదుకదా, కనీసం ఆయన చిత్రపటాన్ని కూడా కొన్ని చోట్ల ప్రదర్శించకుండా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంతో సంబంధం లేని వ్యక్తుల చిత్రాలను ప్రదర్శిస్తూ అంబేద్కర్‌ను పక్కనపెట్టడం దురదృష్టకరమన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు, ఓటు హక్కు, జీవించే హక్కు, సమానత్వ హక్కు వంటి




ప్రజల మౌలిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచింది డాక్టర్ అంబేద్కర్ నే అని స్పష్టం చేశారు. అంబేద్కర్ లేకుంటే భారత రాజ్యాంగమే లేదని, రాజ్యాంగం లేకుంటే ఈ రాజ్యమే లేదని వ్యాఖ్యానించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాన్ని తప్పనిసరిగా ప్రదర్శించాలనే విధంగా ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, ప్రతి కలెక్టర్ తమ బాధ్యతగా వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఆదేశాలు పాటించని వారిని రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, బీసీ సంఘ నాయకులు వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**